

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV

STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా





సంపుటి - 07 | సంచిక 274 | ఎడిటర్ : బరిగెల శివ | శుక్రవారం 04, సెప్టెంబర్ 2026 | పేజీలు 8 | వెల రూ. 5


పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పంజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్





# చిరస్థాయి సేవలకు..
# చిరస్మరణీయమైన గుర్తింపు !





**డాక్టర్ బరిగెల శివ ను వరిస్తున్న సేవా గౌరవాలు**

**జర్నలిజాన్ని బ్రతికించుకోవడం కోసం పరితపిస్తున్నారు**

**నశించిపోతున్న విలువలను వెతికి పట్టి కాపాడుతున్నాడు**

**విలువలతో కూడిన జర్నలిజం ఆయనకే సొంతం**

**ఎంత కష్టపడితే అంత హోదా లభిస్తుందనడానికి మనోడే ఉదాహరణ**

**మారుతున్న కాలంలో మనోని జర్నలిజం మారు మోగుతుంది**

**డెమోక్రాటిక్ జర్నలిస్ట్స్ యూనియన్ తెలంగాణ రాష్ట్ర అడ్ హాక్ కమిటీ కన్వీనర్‌గా డాక్టర్ బరిగెల శివ**

హైదరాబాద్(జై భీమ్ డెస్క్)

డెమోక్రాటిక్ జర్నలిస్ట్స్ యూనియన్ (డీజేయూ) తెలంగాణ రాష్ట్ర అడ్ హాక్ కమిటీని ఏర్పాటు చేసింది. యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షుడు బళ్ళ రాధాకృష్ణ, వ్యవస్థాపక సభ్యుడు మరిదు ప్రసాదబాబు సంయుక్తంగా తెలంగాణ రాష్ట్ర అడ్ హాక్ కమిటీ సభ్యులను నియమించారు. తెలంగాణ రాష్ట్ర డెమోక్రాటిక్ జర్నలిస్ట్స్ యూనియన్ అడ్ హాక్ కమిటీ కన్వీనర్‌గా


- మిగతా 2లో..








## వైఎస్సార్ ఆశయాలే లక్ష్యంగా ప్రాజెక్టుల పూర్తి

ప్రాణహిత-చేవెళ్ల, ఎస్ఎల్‌బీసీ, కల్వకుర్తి ప్రాజెక్టులు పూర్తి చేస్తాం

మూడు ప్రాజెక్టులతో 16 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యం

వైఎస్సార్ రైతు సంక్షేమాన్ని సీఎం రేవంత్‌రెడ్డి గుర్తు చేసుకున్నారు

రైతులకు ఉచిత విద్యుత్ అందించిన గొప్ప నాయకుడు వైఎస్సార్

వైఎస్సార్ చివరి కోరికను నెరవేర్చేందుకు కలిసికట్టుగా పనిచేయాలని పిలుపు




4


# గడ్డు "కాలంలో "రాష్ట్ర" గర్వం

**హామీల అమల్లో వెలితి**

**వెయ్యి రోజుల పాలనపై వెక్కిరింతలు**

**ప్రజా పాలనను పక్షపాతిగా పాటిస్తున్నారా**

**కక్ష సాధింపులతో రగిలిపోతున్న కాంగ్రెస్ పార్టీ**

**రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టేస్తున్నారు**

**ప్రజాస్వామ్య విలువలను పూర్తిగా విడమరుస్తున్నారు**

**6 గ్యారంటీలు అమలు తెలంగాణ ప్రజల్ని మోసగించింది**

**పకడ్బందీ.... హామీలన్నీ హామిల్లాలాగే మిగిలిపోతున్నాయి !**

**కాంగ్రెస్ పార్టీ పాలనలో పేద ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారు**

**విద్యా, వైద్యం, ఉద్యోగం, పూర్తిగా కుంటుపడ్డాయి**

**ప్రజావిశ్వాసానికి రాష్ట్ర ప్రభుత్వం ఏమని బదులిస్తారు**

**డాక్టర్ బరిగెల శివ**



తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న వేళ.. ఇచ్చిన హామీల అమలుపై ప్రజల్లో తీవ్ర చర్చ మొదలైంది. ఆరు గ్యారెంటీల్లో కొన్ని అమలైనప్పటికీ.. మరికొన్ని కీలక హామీలు ఇంకా కార్యరూపం దాల్చలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజాపాలన పేరుతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారంలో ఆశించిన స్థాయిలో ముందుకు సాగడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రైతులు, మహిళలు, నిరుద్యోగులు, కార్మికులు, పేదలు తమకు ఇచ్చిన హామీల కోసం ఎదురుచూస్తున్న పరిస్థితి నెలకొంది. విద్య, వైద్యం, ఉపాధి రంగాల్లో సవాళ్లు కొనసాగుతున్నాయని ప్రతిపక్షాలు, ప్రజా సంఘాలు విమర్శిస్తున్నాయి. మరోవైపు భారీ ప్రాజెక్టులు, అభివృద్ధి ప్రణాళికలపై ప్రభుత్వం దృష్టి సారిస్తున్నప్పటికీ.. సంక్షేమ హామీల అమలుకు స్పష్టమైన కాలపట్టిక ఎక్కడన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రభుత్వంపై విమర్శలు చేసే ప్రతిపక్షాలు, ప్రజా సంఘాల పట్ల వ్యవహరిస్తున్న తీరుపైనా ప్రజాస్వామ్యవాదులు ప్రశ్నలు సంధిస్తున్నారు. భూ సమస్యలు, అధికారుల బదిలీలు, ప్రభుత్వ పథకాల అమలు వంటి అంశాల్లోనూ ప్రజల నుంచి అసంతృప్తి వ్యక్తమవుతోందనే వాదనలు ఉన్నాయి. ఐదేళ్ల పాలనలో ఇప్పటికే వెయ్యి రోజులు పూర్తికాగా.. ఇక మిగిలింది కేవలం 825 రోజులే కావడంతో ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఎప్పుడు, ఎలా నెరవేరుస్తుందన్నది కీలకంగా మారింది. మాటలకంటే చేతల్లోనే ప్రజాపాలనను నిరూపించుకోవాల్సిన సమయం వచ్చిందని.. ప్రజా విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలంటే మిగిలిన కాలంలో హామీల అమలుకు ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ చూపాలని డాక్టర్ బరిగెల శివ పేర్కొన్నారు.

- హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)


2

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE సమస్యలపై సమరంగా Jai Bheem TV సామాన్యుడి ఆయుధంగా

## ఒకే కులం... ఇద్దరు మహిళా నేతలు...

ఒకరికి పదవి గుడ్‌బై, మరొకరికి పదవి గిఫ్ట్!



హైదరాబాద్(జై భీమ్ డెస్క్)

రాజకీయాలు ఎప్పుడు ఎవరి తలరాతను ఎలా మార్చుతాయో చెప్పడానికి ఈ ఫొటోనే తాజా ఉదాహరణగా మారింది. ఫొటోలో కలిసి సందడి చేస్తున్న కొండా సురేఖ, గుండు సుధారాణి ఇద్దరూ పద్మశాలి సామాజిక వర్గానికి చెందిన మహిళా నాయకులే. కానీ కాలం తిరిగే సరికి రాజకీయ చిత్రమే మారిపోయింది. ఒకవైపు కొండా సురేఖ మంత్రి పదవి నుంచి తప్పుకోవాల్సిన పరిస్థితి... మరోవైపు గుండు సుధారాణికి చైర్మన్ పదవి! ఒకే సామాజిక వర్గానికి చెందిన ఇద్దరు నేతల రాజకీయ ప్రయాణంలో చోటుచేసుకున్న ఈ విభిన్న పరిణామాలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. నిన్న కలిసి చేతులు పట్టుకుని సందడి చేసిన ఈ ఇద్దరు నేతల్లో... నేడు ఒకరి చేతి నుంచి అధికారం జారిపోతుంటే, మరోకరి చేతికి కొత్త పదవి చేరింది! ఇదే రాజకీయమంటే... ఇక్కడ శాశ్వత మిత్రులు ఉండరు, శాశ్వత పదవులు అంతకంటే ఉండవు!

# చిరస్థాయి “సేవలకు” చిరస్మరణీయమైన గుర్తింపు

మొదటి పేజీ తరువాయి

డాక్టర్ బరిగెల శివ (జై భీమ్ టీవీ) ను నియమించారు. జర్నలిజం రంగంలో ప్రజా సమస్యలపై నిరంతరం స్పందిస్తూ, సామాజిక అంశాలను వెలుగులోకి తీసుకువస్తున్న డాక్టర్ బరిగెల శివకు ఈ కీలక బాధ్యత దక్కడం పట్ల పలువురు జర్నలిస్టులు, మీడియా ప్రతినిధులు అభినందనలు తెలియజేస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర అడ్ హాక్ కమిటీ కన్వీనర్‌గా డాక్టర్ బరిగెల శివ – జై భీమ్ టీవీ వ్యవహరించనుండగా, కమిటీ సభ్యులుగా ఉరిటి హిమబిందు – ఐ న్యూస్, కొత్త కల్పన – ఇండియన్ రిపబ్లిక్ టీవీ, ఎం.ఎస్. ఆనందరావు – 6 టీవీ, వి. జ్యోతిబసు – రాజ్ న్యూస్, వన్నాల వేణు -- జీ టీవీ, డి.ఆర్.కె. రాజు – సాక్షి దినపత్రిక, విజయ్ సాధు – దయల్ న్యూస్, స్టాలిన్ మర్లపాటి – నేషనలిస్ట్ హబ్లను నియమించినట్లు డీజేయూ విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షుడు బళ్ళ రాధాకృష్ణ, వ్యవస్థాపక సభ్యుడు మరిదు ప్రసాదబాబు మాట్లాడుతూ, తెలంగాణలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలు, వారి హక్కుల పరిరక్షణ, సంక్షేమం, చిన్న మరియు స్వతంత్ర మీడియా సంస్థలకు ప్రోత్సాహం వంటి అంశాలపై అడ్ హాక్ కమిటీ ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. తెలంగాణలో జర్నలిస్టుల ఐక్యతను బలోపేతం చేయడం, మీడియా రంగంలో పనిచేస్తున్న జర్నలిస్టుల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయడం, వృత్తిపరమైన హక్కులు, సంక్షేమం కోసం పోరాడటం అడ్ హాక్ కమిటీ ప్రధాన లక్ష్యంగా పనిచేయనున్నట్లు తెలిపారు. వివిధ మీడియా సంస్థలకు చెందిన అనుభవజ్ఞులైన జర్నలిస్టులతో తెలంగాణ రాష్ట్ర అడ్ హాక్ కమిటీని ఏర్పాటు చేయడం ద్వారా డెమోక్రాటిక్ జర్నలిస్ట్స్ యూనియన్ రాష్ట్రంలో తన కార్యకలాపాలను మరింత విస్తరించే దిశగా అడుగులు వేస్తోందని జర్నలిస్టు వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. తెలంగాణ రాష్ట్ర డెమోక్రాటిక్ జర్నలిస్ట్స్ యూనియన్ అడ్ హాక్ కమిటీ కన్వీనర్‌గా డాక్టర్ బరిగెల శివకు బాధ్యతలు దక్కడంపై జై భీమ్ టీవీ, జై భీమ్ న్యూస్ కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు అభినందనలు తెలిపారు. కొత్త బాధ్యతల్లో డాక్టర్ బరిగెల శివ విజయవంతంగా పనిచేసి తెలంగాణ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి, వారి హక్కుల పరిరక్షణకు కృషి చేయాలని ఆకాంక్షించారు.

# గడ్డు “కాలంలో “రాష్ట్ర” గర్వం

హామీల అమల్లో వెలితి

వెయ్యి రోజుల పాలనపై వెక్కిరింతలు

ప్రజా పాలనను పక్షపాతిగా పాటిస్తున్నారా

కక్ష సాధింపులతో రగిలిపోతున్న కాంగ్రెస్ పార్టీ

రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టేస్తున్నారు

ప్రజాస్వామ్య విలువలను పూర్తిగా విడమరుస్తున్నారు

6 గ్యారంటీలు అమలు తెలంగాణ ప్రజల్ని మోసగించింది

పకడ్బందీ.... హామీలన్నీ హామిల్లాలాగే మిగిలిపోతున్నాయి !

కాంగ్రెస్ పార్టీ పాలనలో పేద ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారు

విద్యా, వైద్యం, ఉద్యోగం, పూర్తిగా కుంటుపడ్డాయి

ప్రజావిశ్వాసానికి రాష్ట్ర ప్రభుత్వం ఏమని బదులిస్తారు :డాక్టర్ బరిగెల శివ



హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)

అధికారం సాగించుకున్నోళ్లదే రాజ్యము అనే విధంగా తెలంగాణ పాలన సాగుతుందని డాక్టర్ బరిగెల శివ ఆరోపించారు.కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనపై ప్రజల్లో మిశ్రమ స్పందన వస్తుందని అన్నారు.రాష్ట్రంలో పెరిగిపోతున్న కుల రాజకీయాల దృష్ట్యా ప్రభుత్వంపై ప్రజలు తీవ్రమైన అసంతృప్తితో కూడిన వ్యతిరేకతను కనపరుస్తున్నారన్నారని ప్రజల అనుమానాలను వ్యక్తపరచారు.రాష్ట్రంలో దేనికి కొదవలేని స్థితి నుండి తెలంగాణ రాష్ట్రాన్ని అంతట నష్టాన్ని చేకూర్చే విధంగా ప్రజా వ్యతిరేక, ప్రజాస్వామ్య వ్యతిరేక పనులు విచ్చలవిడిగా సాగుతున్నాయి అన్నారు.ఆర్భాటాలకు మాత్రమే అవకాశాలు కల్పిస్తూ అనుకున్న స్థాయి అభివృద్ధిని సాధించకపోగా రాజకీయ కక్షసాధింపులతో రగిలిపోతున్నట్లు కాంగ్రెస్ పార్టీ అంతర్గత వ్యవహారాలు బహిర్గతం చేస్తున్నాయన్నారు. ప్రజలను నమ్మకంతో గెలుస్తాము అనేది పోయి, ప్రజలను నమ్మించి గెలుస్తాను అనే స్థాయి నుండి ప్రజలకు నమ్మకద్రోహం చేసైనా గెలుస్తామనే ధీమా దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో పెరిగిపోతుండగా తెలంగాణలో కూడా అలాంటి వాతావరణమే ఏర్పడుతున్నట్టు రాష్ట్ర ప్రభుత్వం పాలిస్తున్న విధానాలు తెలియజేస్తున్నాయి అన్నారు.ప్రజా సమస్యల శాశ్వత పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల నెరవేర్పుకు కాంగ్రెస్ ప్రభుత్వం సముకంగా ఉన్నట్లుగా కనిపించడం లేదన్నారు.రాష్ట్రవ్యాప్తంగా ప్రజా సదస్సులతో, బహిరంగ సభలతో, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాధనాన్ని విపరీతమైన దుబారాగా ఖర్చు చేస్తుందని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న బహిరంగ సభలు సమావేశాలు తెలియజేస్తున్నాయన్నారు. రాష్ట్రంలో కొన్ని వర్గాలకే సముచిత న్యాయం జరుగుతుందని పేద ప్రజల సంక్షేమాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం గు ర్తించేస్థాయిలో లేకపోవడం కనీసంలో కనీసానికైనా పట్టించుకోవడం లేదని మాత్రం స్పష్టంగా వెలుగు చూస్తుందన్నారు.మరోవైపు కక్ష సాధింపులతో రగిలిపోతూ కాంగ్రెస్ ప్రభుత్వానికి గిట్టని వ్యక్తులను గిట్టని నాయకులను గిట్టని ప్రతిపక్షాలను తీవ్రంగా వేధిస్తూ దేశంలో జాతీయ కాంగ్రెస్పై ప్రభావం చూపించే విధంగా ప్రజాస్వామ్య వ్యతిరేక పరిపాలన అవలంబిస్తున్నట్లు రాష్ట్ర ప్రజలు తీవ్ర విమర్శలు వ్యక్తం చేస్తున్నారని తెలిపారు.వెయ్యి రోజుల పాలనలో అవినీతి అక్రమాలు ఊహించని స్థాయిలో పెరిగిపోవడమే కాకుండా విద్యా, వైద్యం, ఉపాధి,అట్టడుగు స్థాయికి చేరిపోతున్నాయని బాధ వ్యక్తం చేశారు.నిజాయితీపరులేమో నిందల పాలవుతూ కక్ష సాధింపు చర్యలకు బలైపోతుండగా అవినీతిపరులు, అక్రమార్కులు అడ్డదారిలో ప్రభుత్వాన్ని శాసిస్తున్న వ్యక్తులు అద్భుతమైన లగ్జరీ జీవితాన్ని గడపడమే కాకుండా ప్రభుత్వాన్ని అడ్డం పెట్టుకొని సాధారణ ప్రజలను వాళ్ళ ఆస్తులను అడ్డగోలుగా దోచుకుంటున్న అన్నారు.భూభారతి పేరు మీద రాష్ట్రంలో జరుగుతున్న భూకబ్జా విధ్వంసాలను రాష్ట్ర ప్రజలు తట్టుకోలేకపోతున్నారని ప్రధానంగా భూభారతి అనే చట్టం ఇప్పటివరకు మేధావులకే అంత చిక్కడం లేదని రాష్ట్రంలో ఎక్కడ చూసినా ప్రైవేట్ భూములలో ప్రభుత్వ భూములలో విచ్చలవిడిగా వ్యాపారాలు సాగుతున్నాయని ప్రభుత్వ భూములనైతే నేరుగా కబ్జాలు చేయడం, ప్రైవేట్ భూములనైతే భూభారతి చట్టాన్ని అడ్డం పెట్టుకొని కబ్జాలు చేయడం లాంటివి తెలంగాణ రాష్ట్ర దౌర్భాగ్యం అన్నారు.తెలంగాణ రాష్ట్రంలోనూ కాంగ్రెస్ పార్టీలో ఎక్కువ శాతం టిడిపి పార్టీకి చెందిన రాజకీయ నాయకులే రాజ్యమేలుతున్నారని మంత్రులతోపాటు ముఖ్యమంత్రితోపాటు ప్రధాన రాజకీయ నాయకులందరూ టిడిపి పార్టీకి అనుబంధ నాయకులేనని చెప్పుకొచ్చారు.రాష్ట్ర ప్రజల్ని అన్ని విధాలుగా సంతృప్తి పరుస్తూ పరిపాలిస్తున్నామని రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం పగటి కలలు కంటుందంటూ హెచ్చరించారు.ప్రజలను ఎంత హరిగోశ పెట్టుకుంటున్నారో ఢిల్లీ కాంగ్రెస్ పెద్దలు పసిగట్టకపోవడం తెలంగాణ కాంగ్రెస్ పార్టీ పాలనను గాలికి వదిలేసినట్టుగా ఉందని అన్నారు.రాష్ట్రంలో ఆర్థిక నిధుల దోపిడే కాకుండా, ఆస్తుల నిలువు దోపిడీ,ప్రజాస్వామ్య విలువల దోపిడి, అరాచక శక్తులను పెంచి పోషించే మార్గాలు పైపెచ్చుగా పెరిగిపోతున్నాయని మండిపడ్డారు. వెయ్యి రోజుల పాలనపై ప్రజాభిప్రాయ సేకరణ ప్రస్తావిస్తూ ఈ క్రింది విధంగా తెలిపారు.

### వెయ్యి రోజుల రేవంత్ పాలన.. హామీలకు దూరం..

### ప్రచారానికే పరిమితమా ప్రజాపాలన? ఆరు గ్యారెంటీలు ఎక్కడ?.. అట్టడుగు వర్గాలకు అందని భరోసా..

### వెయ్యి రోజుల పాలనపై ప్రజల్లో ప్రశ్నలు.

తెలంగాణలో రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న నేపథ్యంలో ప్రభుత్వ పనితీరుపై ప్రజల్లో అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఐదేళ్ల పాలనా కాలంలో మొత్తం 1,825 రోజుల్లో ఇప్పటికే వెయ్యి రోజులు పూర్తయ్యాయి. అంటే ప్రభుత్వానికి మిగిలింది కేవలం 825 రోజులే. అయినప్పటికీ ఇంకా సమయం ఉందంటూ అధికార పార్టీ నేతలు చెప్పుకోవడం కంటే, ఇప్పటివరకు ఇచ్చిన హామీల్లో ఎన్ని అమలు చేశామనే విషయంపై ప్రజలకు స్పష్టమైన జవాబు చెప్పాల్సిన అవసరం ఉందనే విమర్శలు వినిపిస్తున్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అధికారమంతా కొద్ది మంది చేతుల్లోనే కేంద్రీకృతమైందనే విమర్శలు వచ్చాయి. ఇప్పుడు కాంగ్రెస్ పాలనలో మాత్రం పరిస్థితి భిన్నంగా ఉందని ప్రభుత్వం చెప్పుకుంటోంది. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు స్వేచ్ఛగా తమ అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారనే అభిప్రాయం ఉన్నప్పటికీ, పాలనలో సమన్వయం లోపిస్తోందనే విమర్శలు కూడా బలంగా వినిపిస్తున్నాయి. ఒకవైపు ప్రజాస్వామ్య పాలన అంటూ చెప్పుకుంటూనే, మరోవైపు విద్యార్థి, ప్రజా, కార్మిక సంఘాల ఆందోళనలను అడ్డుకోవడం, అరెస్టులకు పాల్పడడం ఎంతవరకు ప్రజాపాలన అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

### కేంద్రంపై పోరాటం ఎక్కడ?

దేశంలో ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో అధికారంలో ఉన్నప్పటికీ, రాష్ట్రానికి రావాల్సిన నిధులు, హక్కులు, పెండింగ్ అంశాలపై కేంద్ర ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీసే ప్రయత్నం ఆశించిన స్థాయిలో కనిపించడం లేదనే విమర్శలు ఉన్నాయి. తెలంగాణ ప్రయోజనాల కోసం కేంద్రంతో పోరాడతామని చెప్పిన కాంగ్రెస్ నాయకత్వం, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ దూకుడు ఎందుకు చూపడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. భారత్ ఫ్యూచర్ సిటీ, ఫోర్త్ సిటీ, ఫార్మా సిటీ, మూసీ ప్రక్షాళన, పారిశ్రామిక విధానాలు వంటి భారీ ప్రణాళికలను ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తున్నప్పటికీ, ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలు విషయంలో మాత్రం ఇంకా అనేక హామీలు పూర్తి స్థాయిలో కార్యరూపం దాల్చలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

### అధికారుల బదిలీలపై ప్రశ్నలు

ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను ఒక శాఖలో పూర్తిగా పని చేసే అవకాశం రాకముందే పదేపదే బదిలీ చేయడం కూడా ప్రభుత్వ పాలనా విధానంపై ప్రశ్నలు రేకెత్తిస్తోంది. తరచూ అధికారుల మార్పులు జరిగితే శాఖల పనితీరు, అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలుపై ప్రభావం పడే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో కొందరు ఉన్నతాధికారులపై తీవ్రమైన ఆరోపణలు చేసిన కాంగ్రెస్ నాయకులు, ఇప్పుడు అదే అధికారుల్లో కొందరిని కీలక బాధ్యతల్లో కొనసాగించడం కూడా రాజకీయ విమర్శలకు కారణమవుతోంది. అప్పట్లో తప్పు అన్నది ఇప్పుడు ఎలా సరైందయ్యిందనే ప్రశ్నకు ప్రభుత్వం సమాధానం చెప్పాల్సి ఉంది.

### కొన్ని పథకాలు అమలు.. మరికొన్ని హామీలు ఏమయ్యాయి?

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ.500 గ్యాస్ సిలిండర్ వంటి పథకాల అమలు ప్రభుత్వానికి కొంత సానుకూలత తీసుకొచ్చిన మాట వాస్తవం. అయితే వాటి అమలులో ఉన్న లోపాలు, అర్హులందరికీ ప్రయోజనం అందకపోవడంపై ఫిర్యాదులు వస్తున్నాయి. అదే సమయంలో ఎన్నికల సమయంలో ఇచ్చిన పలు కీలక హామీలు ఇంకా పూర్తిస్థాయిలో అమలు కాకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సహాయం, ఆటో కార్మికులకు నెలవారీ భృతి, వ్యవసాయ కార్మికులకు వార్షిక ఆర్థిక సాయం, ఇతర వర్గాలకు ప్రకటించిన పథకాలు ఎప్పుడు అమలవుతాయనే ప్రశ్నలు ఆయా వర్గాల్లో వినిపిస్తున్నాయి. హామీలు ఇచ్చినప్పుడు భారీ ప్రచారం చేసిన ప్రభుత్వం, అమలు విషయంలో మాత్రం ఎందుకు ఆలస్యం చేస్తోంది? అనే ప్రశ్న ఇప్పుడు ప్రజల్లో ప్రధానంగా వినిపిస్తోంది.

### రైతులు, పింఛన్‌దారుల నిరీక్షణ..

రైతు భరోసా సాయం సకాలంలో అందకపోవడంపై రైతుల నుంచి ఆవేదన వ్యక్తమవుతోంది. మరోవైపు ఆసరా, చేయూత పింఛన్ల పెంపుపై లబ్ధిదారులు ఆశగా ఎదురుచూస్తున్నారు. ఎన్నికల హామీలను నమ్మి ఎదురుచూస్తున్న ప్రజలకు స్పష్టమైన కాలపట్టికను ప్రభుత్వం ప్రకటించాల్సిన అవసరం ఉందనే డిమాండ్ పెరుగుతోంది.

### ప్రజాపాలన అంటే ఇదేనా?

ప్రజల సమస్యలను వినడం, నిరసనలకు అవకాశం ఇవ్వడం, విమర్శలను స్వీకరించడం ప్రజాస్వామ్య ప్రభుత్వ లక్షణాలు. కానీ ఆందోళనలకు దిగుతున్న విద్యార్థులు, కార్మికులు, ప్రజా సంఘాలపై ఆంక్షలు, అరెస్టులు వంటి ఘటనలు చోటుచేసుకుంటే కాంగ్రెస్ చెప్పుకుంటున్న “ప్రజాపాలన”పై ప్రశ్నలు రావడం సహజం. మరోవైపు కీలక శాఖలపై సమీక్షలు, పర్యవేక్షణ మరింత బలోపేతం కావాల్సిన అవసరం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రజా సమస్యలపై ప్రభుత్వం వేగంగా స్పందించాలనే డిమాండ్ కూడా పెరుగుతోంది.

### వెయ్యి రోజులు పూర్తి.. ఇక మిగిలిన 825 రోజులు కీలకం..

వెయ్యి రోజుల పాలన తర్వాత కూడా హామీల అమలు కోసం ప్రజలు ఎదురుచూడాల్సి వస్తే, ప్రభుత్వంపై సహజంగానే అసంతృప్తి పెరుగుతుంది. భారీ ప్రాజెక్టులు, దీర్ఘకాలిక ప్రణాళికలు అవసరమే. కానీ నిత్యజీవితంలో ఇబ్బందులు పడుతున్న పేదలు, రైతులు, మహిళలు, కార్మికులు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కేవలం భవిష్యత్ ప్రణాళికలతో ప్రజలను సంతృప్తిపరచడం సాధ్యం కాదు. వెయ్యి రోజుల తర్వాత రేవంత్ సర్కార్ ముందు ఉన్న అసలు పరీక్ష ఒక్కటే–ఇచ్చిన హామీలను మిగిలిన 825 రోజుల్లో ఎంతవరకు అమలు చేస్తుంది? ప్రభుత్వం ఇప్పటికైనా ఆత్మవిమర్శ చేసుకోవాలి. పాలనలోని లోపాలను సరిదిద్దుకోవాలి. అధికారుల మార్పులు, శాఖల మధ్య సమన్వయం, సంక్షేమ పథకాల అమలు, రైతుల సమస్యలు, పింఛన్ల పెంపు, మహిళలకు ఇచ్చిన హామీలు వంటి అంశాలపై స్పష్టమైన చర్యలు తీసుకోవాలి. లేకపోతే “ప్రజాపాలన” అనే నినాదం ప్రచారానికే పరిమితమైందనే విమర్శలను ప్రభుత్వం ఎదుర్కోవాల్సి వస్తుంది. వెయ్యి రోజుల పాలన పూర్తయింది... ఇక మాటల కాలం కాదు, మిగిలిన 825 రోజుల్లో హామీలను చేతల్లో చూపించాల్సిన సమయం వచ్చింది. లేకపోతే ప్రజలు ప్రశ్నించే రోజు ఎంతో దూరంలో ఉండదు! అంటూ హెచ్చరించారు.

# ములుగు జిల్లాలో మీసేవ, ఆధార్ కేంద్రాల వరుస తనిఖీలు



**అధిక రుసుములు వసూలు చేస్తే కఠిన చర్యలు తప్పవు**

**నిర్ణీత రుసుముల ప్రకారమే సేవలు అందించాలి: ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ దేవేందర్**

**ములుగు, 3 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)**

ములుగు జిల్లాలో మీసేవ, ఆధార్ కేంద్రాలపై అధికారులు వరుస తనిఖీలు నిర్వహించారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు సులభంగా, పారదర్శకంగా అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఈ–డిస్ట్రిక్ట్ మేనేజర్ దేవేందర్ తెలిపారు. గోవిందరావుపేట, వెంకటాపూర్ మండలాల్లోని పలు మీసేవ, ఆధార్ కేంద్రాలను ఈ–డిస్ట్రిక్ట్ మేనేజర్ దేవేందర్, మీసేవ జిల్లా మేనేజర్ పోలోజు విజయ్‌తో కలిసి తనిఖీ చేశారు. గోవిందరావుపేట మండలంలోని పస్రా, గోవిందరావుపేట, చల్వాయి, వెంకటాపూర్ మండలంలోని పాలంపేట, కేశవాపూర్, నర్సాపూర్, వెంకటాపూర్ గ్రామాల్లోని మీసేవ, ఆధార్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రాల్లో ప్రజలకు అందుతున్న సేవలు, దరఖాస్తుల స్వీకరణ, రుసుముల వసూళ్లు, అవసరమైన సమాచార ప్రదర్శన తదితర అంశాలను అధికారులు పరిశీలించారు. దరఖాస్తుదారుల నుంచి ప్రభుత్వం నిర్ణయించిన రుసుము కంటే అధికంగా డబ్బులు వసూలు చేయవద్దని మీసేవ, ఆధార్ కేంద్రాల నిర్వాహకులను దేవేందర్ తీవ్రంగా హెచ్చరించారు. నిర్ణీత రుసుముల పట్టిక ప్రకారం మాత్రమే రుసుములు తీసుకోవాలని సూచించారు. మీసేవ కేంద్రాలకు వచ్చే ప్రజలతో నిర్వాహకులు మర్యాదగా, సున్నితంగా వ్యవహరించాలని, దరఖాస్తుదారుల పట్ల దురుసుగా ప్రవర్తించకూడదని ఆదేశించారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం మీసేవ కేంద్రాలను నిర్వహించాలని సూచించారు. మీసేవ, ఆధార్ కేంద్రాల్లో తప్పనిసరిగా పౌరుల హక్కుల పట్టిక, భూభారతి సేవలకు సంబంధించిన సమాచార ఫలకాలు, మీసేవ గుర్తు, తహసీల్దార్, ఈ–డిస్ట్రిక్ట్ మేనేజర్, పరిష్కారం సహాయ కేంద్రాల ఫోన్ నంబర్లు స్పష్టంగా కనిపించేలా ఏర్పాటు చేయాలని దేవేందర్ ఆదేశించారు. అలాగే కళ్యాణలక్ష్మి, వికలాంగుల ప్రత్యేక గుర్తింపు కార్డు, జనన ధ్రువపత్రాలు, మరణ ధ్రువపత్రాల నమోదు సమయంలో ఎలాంటి తప్పులు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు అవసరమైన అన్ని రకాల మీసేవ, ఇతర ఆన్‌లైన్ సేవలను అందించేందుకు నిర్వాహకులు బాధ్యతగా పనిచేయాలని ఆదేశించారు. ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా మీసేవ కేంద్రాల ద్వారా ప్రభుత్వ సేవలను సులభంగా పొందే విధంగా నిర్వాహకులు సహకరించాలని అధికారులు తెలిపారు. గ్రామ పంచాయతీ అధికారులు, రెవెన్యూ పరిశీలకుల కోసం ప్రత్యేక మీసేవ మొబైల్ అనువర్తనం అందుబాటులో ఉందని, దాని ద్వారా సేవల పర్యవేక్షణ మరింత సులభతరం అవుతుందని తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన రుసుము కంటే అధికంగా దరఖాస్తుదారుల నుంచి డబ్బులు వసూలు చేసినట్లు గుర్తించినా, ఫిర్యాదు వచ్చినా సంబంధిత మీసేవ కేంద్రంపై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఈ–డిస్ట్రిక్ట్ మేనేజర్ దేవేందర్ స్పష్టం చేశారు. ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడం, ప్రభుత్వ సేవలను పారదర్శకంగా అందుబాటులోకి తీసుకురావడమే అధికారుల ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ తనిఖీల కార్యక్రమంలో మీసేవ జిల్లా మేనేజర్ పోలోజు విజయ్‌తో పాటు ఆయా మీసేవ, ఆధార్ కేంద్రాల నిర్వాహకులు పాల్గొన్నారు.

## మహిళలు తప్పనిసరిగా క్యాన్సర్ స్క్రీనింగ్ చేయించుకోవాలి





**తొలిదశలో గుర్తిస్తే క్యాన్సర్‌ను పూర్తిగా నయం చేసే అవకాశం: ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు**

**ఐనవోలు పీహెచ్‌సీలో ఉచిత క్యాన్సర్ నిర్ధారణ వైద్య శిబిరం ప్రారంభం**

**ఐనవోలు, 3 సెప్టెంబర్ 2026(జై భీమ్ న్యూస్)**

మహిళలు తమ ఆరోగ్యంపై నిర్లక్ష్యం చేయకుండా తప్పనిసరిగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు అన్నారు. గురువారం ఐనవోలు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో సింధు హాస్పిటల్ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత క్యాన్సర్ నిర్ధారణ వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించి స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ క్యాన్సర్‌ను తొలిదశలోనే గుర్తించి సకాలంలో చికిత్స అందిస్తే పూర్తిగా నయం చేసే అవకాశం ఉంటుందని తెలిపారు. కుటుంబ బాధ్యతల్లో నిమగ్నమై చాలామంది మహిళలు తమ ఆరోగ్యాన్ని పట్టించుకోవడం లేదని, ఫలితంగా వ్యాధి ముదిరిన తర్వాత ఆసుపత్రులను ఆశ్రయిస్తే చికిత్స కష్టతరంగా మారడంతో పాటు వైద్య ఖర్చులు కూడా పెరిగే అవకాశం ఉంటుందని అన్నారు. మహిళలు ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడంతో పాటు క్యాన్సర్ స్క్రీనింగ్‌ను కూడా తప్పనిసరిగా చేయించుకోవాలని సూచించారు. వైద్య శిబిరంలో నిర్వహించే స్క్రీనింగ్ ద్వారా అనుమానిత కేసులను ముందుగానే గుర్తించి, వారికి అవసరమైన తదుపరి పరీక్షలు, చికిత్స అందేలా వైద్య సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. అవసరమైన వారికి ప్రభుత్వ పథకాల ద్వారా ఉచితంగా లేదా తక్కువ ఖర్చుతో అందుబాటులో ఉన్న వైద్య సేవలపై అవగాహన కల్పించాలని వైద్యులను కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో క్యాన్సర్‌పై ప్రజలకు మరింత అవగాహన కల్పించేందుకు ఇలాంటి ఉచిత క్యాన్సర్ హెల్త్ క్యాంపులను అన్ని మండలాల్లో నిర్వహించాలని సింధు హాస్పిటల్ సిబ్బందిని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో ఐనవోలు మండల అధ్యక్షుడు నకరకంటి మోహన్ గౌడ్, జిల్లా అధికార ప్రతినిధి నిమ్మని శేఖర్ రావు, హనుమకొండ జిల్లా కిసాన్ అధ్యక్షుడు పింగిలి వెంకట నరసింహా రెడ్డి, ఉపాధ్యక్షుడు పోలపల్లి బుచ్చిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు రాయపురం సాంబయ్య, సమ్మెట మహేందర్ గౌడ్, కార్యదర్శి కట్కూరి స్వామి, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు పోలపల్లి శివ శంకర్ రెడ్డి, సీనియర్ నాయకులు మహ్మద్ రఫీ, మండల యూత్ అధ్యక్షుడు కత్తి సుధీర్ గౌడ్, మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ కట్కూరి సునీల్, వివిధ గ్రామాల అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు, ఉపసర్పంచులు పాల్గొన్నారు. అలాగే సింధు హాస్పిటల్ క్యాన్సర్ సర్జన్ డాక్టర్ మధు నారాయణ, డాక్టర్ హనిష్, మార్కెటింగ్ డైరెక్టర్లు విద్యాప్రకాశ్, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

## నోటీసులు అందుకున్న ఓటర్లు నిర్దేశిత తేదీలో విచారణ కేంద్రాలకు హాజరు కావాలి

**ఎన్నికల సంఘం సూచించిన ధ్రువపత్రాలు సమర్పించాలి: అదనపు కలెక్టర్ ఎన్. రవి**

**హన్మకొండ, 3 సెప్టెంబర్ 2026(జై భీమ్ న్యూస్)**

ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా మ్యాపింగ్ కాని, అనామలీస్ జాబితాలో ఉన్న ఓటర్లు నోటీసులో పేర్కొన్న నిర్దేశిత తేదీ, సమయంలో సంబంధిత విచారణ కేంద్రాలకు హాజరై ఎన్నికల సంఘం సూచించిన ధ్రువపత్రాలను ఏఈఆర్ఓలకు సమర్పించాలని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి సూచించారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని అదనపు కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియపై జాతీయ, రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో అదనపు కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించిన పలు అంశాలను రాజకీయ పార్టీల ప్రతినిధులకు అదనపు కలెక్టర్ వివరించారు. ముఖ్యంగా అనామలీస్ (లోపాలు/అసమానతలు), నో మ్యాపింగ్‌కు సంబంధించి నోటీసులు అందుకున్న ఓటర్ల విచారణ కోసం ఏర్పాటు చేసిన కేంద్రాలు, విచారణ విధానం, ఓటర్లు సమర్పించాల్సిన ధ్రువపత్రాలు, పాటించాల్సిన నిబంధనలను వివరించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగానే జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియ కొనసాగుతోందని ఎన్. రవి తెలిపారు. నోటీసులు అందుకున్న ప్రతి ఓటరు నోటీసులో పేర్కొన్న ప్రదేశం, తేదీ, సమయంలో సంబంధిత విచారణ కేంద్రానికి తప్పనిసరిగా హాజరై ఏఈఆర్ఓకు అవసరమైన ధ్రువపత్రాలను సమర్పించాలని సూచించారు. నిర్దేశిత తేదీన విచారణకు హాజరుకాని ఓటర్లకు ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం తదుపరి నోటీసు జారీ చేయనున్నట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. ప్రస్తుతం ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా మొదటి దశలో జారీ చేసిన నోటీసులపై విచారణ కొనసాగుతోందని



వెల్లడించారు. విచారణలు, నోటీసుల జారీ, ధ్రువపత్రాల సమర్పణ తదితర అంశాలపై అధికారులు ఇచ్చిన వివరణ పట్ల సమావేశానికి హాజరైన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో వరంగల్ పశ్చిమ ఈఆర్ఓ/హనుమకొండ ఆర్డీవో వెంకటేష్‌తో పాటు గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు అమరేందర్ రెడ్డి, ఎండి. నేహాల్, శ్యామ్ సుందర్, ప్రవీణ్ కుమార్, రజనీకాంత్, సయ్యద్ ఫైజుల్లా, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్‌పై కాజీపేట ట్రాఫిక్ పోలీసుల కొరడా

**15 మంది పట్టుబాటు.. ఒకరికి రూ.1,500 జరిమానా, ఏడాది పాటు డ్రైవింగ్ లైసెన్స్ సస్పెన్షన్ : ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ పి. వెంకన్న**

**కాజీపేట, 3 సెప్టెంబర్ 2026(జై భీమ్ క్రైమ్ న్యూస్)**

డ్రంక్ అండ్ డ్రైవ్‌కు పాల్పడుతున్న వాహనదారులపై కాజీపేట ట్రాఫిక్ పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు. వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్ ఆదేశాల మేరకు, అడిషనల్ డీసీపీ (ట్రాఫిక్ అండ్ ఎల్అండ్ఓ) రాయల ప్రభాకర్ రావు సూచనలతో, వరంగల్ ట్రాఫిక్ ఏసీపీ టి. సత్యనారాయణ పర్యవేక్షణలో కాజీపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 15 మంది వ్యక్తులు పట్టుబడ్డారు. వీరిలో ఒకరు గతంలోనూ డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో పట్టుబడి, రెండోసారి అదే నేరానికి పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. రెండోసారి పట్టుబడిన వ్యక్తిని పోలీసులు సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కె. రాజశేఖర్ రెడ్డి ఎదుట హాజరుపరిచారు. కేసును విచారించిన న్యాయస్థానం సదరు వ్యక్తికి రూ. 1,500 జరిమానా విధించడంతో పాటు, డ్రైవింగ్ లైసెన్స్‌ను ఒక సంవత్సరం పాటు సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలకు కారణమై ప్రాణ నష్టం సంభవించే అవకాశం ఉందని పోలీసులు హెచ్చరించారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌కు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని కాజీపేట ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలను నిరంతరం కొనసాగిస్తామని తెలిపారు.

## పంటపొలాల్లో డిజిటల్ సర్వేను పరిశీలించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**వరంగల్, 3 సెప్టెంబర్ 2026(జై భీమ్ న్యూస్)**

జిల్లాలో పంటల వివరాలను కచ్చితంగా నమోదు చేసేందుకు చేపట్టిన డిజిటల్ పంటల సర్వే ప్రక్రియను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, ఐఏఎస్ గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సంగెం మండలం రామచంద్రాపురం, దుగ్గొండి మండలం నాచినపల్లి, గిర్నిబావి గ్రామాల్లోని పంట పొలాలను కలెక్టర్ సందర్శించి, అక్కడ జరుగుతున్న డిజిటల్ సర్వే ప్రక్రియను పరిశీలించారు. రైతులు సాగు చేస్తున్న పంటలు, పంటల విస్తీర్ణం తదితర వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి డిజిటల్ విధానంలో నమోదు చేస్తున్న తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. పంటల వివరాల నమోదులో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించి, ఖచ్చితమైన సమాచారాన్ని డిజిటల్ సర్వేలో నమోదు చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. రైతులు వాస్తవంగా సాగు చేస్తున్న పంటలు, వాటి విస్తీర్ణానికి సంబంధించిన వివరాలు సక్రమంగా నమోదు కావాలని సూచించారు. డిజిటల్ పంటల సర్వే ద్వారా జిల్లాలో సాగు విస్తీర్ణం, రైతులు సాగు చేస్తున్న వివిధ పంటలకు సంబంధించిన సమగ్ర సమాచారం అందుబాటులోకి వస్తుందని కలెక్టర్ తెలిపారు. ఈ వివరాలు భవిష్యత్‌లో వ్యవసాయ ప్రణాళికల రూపకల్పనతో పాటు రైతులకు ప్రభుత్వం అమలు చేసే వివిధ సంక్షేమ, వ్యవసాయ పథకాల ప్రయోజనాలు అందించడంలో కీలకంగా ఉపయోగపడతాయని పేర్కొన్నారు. సర్వే ప్రక్రియను అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలని, రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా పారదర్శకంగా, సమర్థవంతంగా సర్వే నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. కలెక్టర్ పర్యటనలో ఉద్యానవన శాఖ అధికారి శ్రీనివాస్ రావు, డీబీసీడీఓ పుష్పలతతో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## తెలంగాణ సంస్కృతి ఉట్టిపడేలా.. సెయింట్ మేరీస్‌లో బోనాల సంబరాలు

**బోనాలు, పోతరాజుల వేషధారణలతో ఆకట్టుకున్న విద్యార్థులు**

**హసన్‌పర్తి, 3 సెప్టెంబర్ 2026 (జై భీమ్ న్యూస్)**



హసన్‌పర్తి మండల కేంద్రంలోని సెయింట్ మేరీస్ ఉన్నత పాఠశాలలో గురువారం బోనాల పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలపై విద్యార్థుల్లో అవగాహన కల్పించే ఉద్దేశంతో నిర్వహించిన ఈ వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగాయి. పదో తరగతి విద్యార్థినులు అమ్మవారికి నైవేద్యంగా బోనాలను సమర్పించే సంప్రదాయాన్ని కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు. విద్యార్థులు బోనాలతో నిర్వహించిన ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పలువురు విద్యార్థులు పోతరాజుల వేషధారణలో బోనాల వెంట నృత్యాలు, ప్రదర్శనలు చేస్తూ తోటి విద్యార్థులను అలరించారు. తెలంగాణలో ఆషాఢ, శ్రావణ మాసాల్లో ఎంతో వైభవంగా నిర్వహించే బోనాల పండుగకు ఉన్న ప్రత్యేకత, చారిత్రక, సాంస్కృతిక ప్రాధాన్యతను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. సంప్రదాయాలను కేవలం పుస్తకాల్లో చదవడం కాకుండా వాటిని ఆచరణాత్మకంగా ప్రదర్శించడం ద్వారా విద్యార్థుల్లో మన సంస్కృతిపై ఆసక్తి పెరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ పాకాల తిరుమలేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ప్రాంత ఆచారాలు, సంప్రదాయాలను నేటితరం విద్యార్థులు ప్రదర్శించడం ఎంతో సంతోషదాయకమన్నారు. బోనాల సంప్రదాయం, దాని విశిష్టతను విద్యార్థులకు వివరించి వేడుకలను విజయవంతం చేసిన ఉపాధ్యాయులను ఆయన అభినందించారు. అనంతరం కిండర్‌గార్డెన్ విద్యార్థులతో కృష్ణాష్టమి వేడుకలను నిర్వహించారు. చిన్నారులు శ్రీకృష్ణుడి వేషధారణలో సందడి చేశారు. శ్రీకృష్ణుడిని ఆదిగురువుగా ఎందుకు కొలుస్తారనే విషయాలను విద్యార్థులకు వివరించిన తెలుగు ఉపాధ్యాయురాలు విజయ రాణిని ప్రిన్సిపాల్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్య ప్రతినిధులు కల్పనా రెడ్డి, గడ్డం వెంకటేశ్వర్లు, ఎలుక రాజు సదానందం, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొని బోనాల, కృష్ణాష్టమి వేడుకలను విజయవంతం చేశారు.

# భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలి

**పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలి: జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్**



**హన్మకొండ, 3 సెప్టెంబర్ 2026(జై భీమ్ న్యూస్)**

జాతీయ రహదారుల నిర్మాణానికి అవసరమైన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. పరకాల డివిజన్‌లో జాతీయ రహదారులకు సంబంధించి కొనసాగుతున్న భూసేకరణ ప్రక్రియపై గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఆర్డీవోలు, తహసీల్దార్లతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భూసేకరణకు సంబంధించిన పురోగతి, పెండింగ్ అంశాలు, పరిహారం చెల్లింపులపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ రహదారుల నిర్మాణాలకు అవసరమైన భూముల సేకరణ ప్రక్రియను ఎలాంటి జాప్యం లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. భూసేకరణకు సంబంధించిన అంశాలు పెండింగ్‌లో ఉన్న ప్రాంతాల్లో సంబంధిత రైతులతో అధికారులు మాట్లాడి, వారి సమస్యలను పరిష్కరించి ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలని ఆదేశించారు. భూసేకరణ ప్రక్రియ పూర్తయిన ప్రాంతాల్లో అర్హులైన భూయజమానులకు ప్రభుత్వం నుంచి అందాల్సిన పరిహారాన్ని కూడా త్వరగా చెల్లించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జాతీయ రహదారుల నిర్మాణ పనులకు భూసేకరణ కీలకమైన అంశమని, అందువల్ల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో పరకాల ఆర్డీవో వెంకన్న, భూసేకరణ విభాగం సూపరింటెండెంట్ జగత్ సింగ్, పరకాల డివిజన్‌కు చెందిన తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

# కాకతీయ విశ్వవిద్యాలయంలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

## సెప్టెంబర్ 5న విద్యా కళాశాలలో ప్రత్యేక కార్యక్రమం

**హన్మకొండ, 3 సెప్టెంబర్ 2026 (జై భీమ్ న్యూస్)**

కాకతీయ విశ్వవిద్యాలయంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. కాకతీయ విశ్వవిద్యాలయ విద్యా కళాశాల ఆధ్వర్యంలో సెప్టెంబర్ 5వ తేదీన ఉదయం 10 గంటలకు ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. నల్లాని శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కె. ప్రతాప్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం గౌరవ అతిథిగా, డీన్ ఆచార్య ఎన్. రామనాథ్ కిషన్, పాఠ్య ప్రణాళిక అధ్యక్షురాలు డా. ఆర్. విజయలత ప్రత్యేక అతిథులుగా పాల్గొననున్నారు. విద్యార్థుల జీవితాల్లో ఉపాధ్యాయుల పాత్ర, వారి సేవలను గుర్తుచేసుకుంటూ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. విద్యా రంగ అభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని, సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులు అందిస్తున్న సేవలను ఈ సందర్భంగా స్మరించుకోనున్నట్లు పేర్కొన్నారు. ఈ వేడుకల్లో కాకతీయ విశ్వవిద్యాలయ విద్యా కళాశాలకు చెందిన బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రిన్సిపాల్ డా. నల్లాని శ్రీనివాస్ కోరారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంతో కళాశాల ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకొననుంది.

# క్రీడలతోపాటు విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ఫిజికల్ డైరెక్టర్లు కృషి చేయాలి

**వీసీ ఆచార్య కె. ప్రతాప్ రెడ్డి**




**హన్మకొండ, 3 సెప్టెంబర్ 2026 (జై భీమ్ న్యూస్)**

క్రీడలతోపాటు విద్యార్థుల శారీరక, మానసిక వికాసానికి ఫిజికల్ డైరెక్టర్లు, వ్యాయామ అధ్యాపకులు కృషి చేయాలని కాకతీయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కె. ప్రతాప్ రెడ్డి అన్నారు. విశ్వవిద్యాలయ సెనెట్ హాల్‌లో గురువారం ఉదయం స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి ఆచార్య వై. వెంకయ్య అధ్యక్షతన విశ్వవిద్యాలయ పరిధిలోని వ్యాయామ అధ్యాపకులతో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధిలో క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయని, క్రీడల ద్వారా శారీరక దారుఢ్యంతోపాటు మానసిక వికాసం, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని వీసీ పేర్కొన్నారు. విశ్వవిద్యాలయంలో క్రీడా మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. పాలక మండలి సమావేశాల్లో క్రీడా మౌలిక వసతుల కల్పనకు సంబంధించి పలు నిర్ణయాలు తీసుకున్నామని, ఇండోర్ క్రీడా సౌకర్యాలను ఒకే ప్రదేశంలో సమీకరించి ఆధునీకరించేందుకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. విశ్వవిద్యాలయంలో అంతర్ విశ్వవిద్యాలయ క్రీడా పోటీలను సమర్థవంతంగా నిర్వహించాలని, విద్యార్థులకు కొత్త క్రీడలను పరిచయం చేసి వాటిని ప్రోత్సహించాలని సూచించారు. స్పోర్ట్స్ బోర్డు కార్యకలాపాలను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని, ప్రతి సంవత్సరం రెండుసార్లు ఫిజికల్ డైరెక్టర్ల సమావేశాలను నిర్వహించాలని ఆదేశించారు. మహిళా విద్యార్థినుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో మహిళా ఫిజికల్ డైరెక్టర్లు, వ్యాయామ అధ్యాపకుల నియామకానికి ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. విశ్వవిద్యాలయ స్వర్ణోత్సవాలు, ఆర్ట్స్ కళాశాల శతాబ్ది ఉత్సవాల నేపథ్యంలో క్రీడా మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించినట్లు వీసీ వెల్లడించారు. అలాగే 'ఖేలో ఇండియా' పథకం ద్వారా క్రీడా వసతుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వానికి కూడా ప్రతిపాదనలు పంపించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా స్పోర్ట్స్ బోర్డు అధ్యక్షులు ఆచార్య వై. వెంకయ్య 2025--26 సంవత్సరానికి సంబంధించిన వార్షిక నివేదికను సమర్పించారు. రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం మాట్లాడుతూ నిబంధనలకు అనుగుణంగా క్రీడలకు అవసరమైన నిధులు విడుదల చేస్తామని తెలిపారు. సామాజిక అవసరాలకు అనుగుణంగా క్రీడలు ఉండాలని, విద్యార్థులను సన్మార్గంలో నడిపించడంలో వ్యాయామ అధ్యాపకుల పాత్ర ఎంతో ముఖ్యమని అన్నారు. పాలక మండలి సభ్యులు, పూర్వ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి ఆచార్య బి. సురేష్ లాల్ మాట్లాడుతూ విద్యార్థులకు శారీరక, మానసిక ఆరోగ్యం ఉన్నప్పుడే వారి సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య టి. మనోహర్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయ క్రీడా ప్రమాణాలను మరింత పెంచాలని, విద్యార్థులు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేలా ప్రోత్సహించాలని సూచించారు. డా. సోమన్న విశ్వవిద్యాలయంలో సింథటిక్ ట్రాక్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని సూచించారు. ప్రస్తుత, నూతన స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి డా. టి. శాస్త్రి మాట్లాడుతూ 2026--27 విద్యా సంవత్సరానికి క్రీడా క్యాలెండర్‌ను రూపొందించి అమలు చేస్తామని, ప్రతి విద్యార్థిలో క్రీడా నైపుణ్యాలను పెంపొందించే దిశగా కృషి చేస్తామని తెలిపారు. విశ్వవిద్యాలయ పరిధిలో విద్యార్థులకు అందాల్సిన క్రీడా ప్రయోజనాలు, వసతులను కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆచార్య రమేష్ రెడ్డి, డా. వెంకన్న, డా. సావిత్రి, డా. ఎ.టి.బి.టి. ప్రసాద్, డా. శ్రీనివాస్ రెడ్డి, డా. రాజేష్, డా. కుమారస్వామితో పాటు విశ్వవిద్యాలయ పరిధిలోని క్రీడా సంచాలకులు, వ్యాయామ అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

# వైఎస్సార్ ఆశయాలే లక్ష్యంగా ప్రాజెక్టుల పూర్తి

**ప్రాణహిత-చేవెళ్ల, ఎస్ఎల్‌బీసీ, కల్వకుర్తి ప్రాజెక్టులను పూర్తి చేస్తాం: సీఎం రేవంత్‌రెడ్డి**




**న్యూఢిల్లీ, 3 సెప్టెంబర్ 2026(జై భీమ్ న్యూస్)**

దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశయాలకు అనుగుణంగా తెలంగాణలోని ప్రాణహిత--చేవెళ్ల, ఎస్ఎల్‌బీసీ, కల్వకుర్తి ఎత్తిపోతల ప్రాజెక్టులను పూర్తి చేసి తెలంగాణ సమాజానికి అంకితం చేస్తామని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఈ మూడు ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రంలో సుమారు 16 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యమని తెలిపారు. న్యూఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో డాక్టర్ వైఎస్సార్--డాక్టర్ కేవీపీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అవార్డు--2026 ప్రదానోత్సవ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొని ప్రసంగించారు. భారతీయ వ్యవసాయం, ఆహార భద్రత, సుస్థిర అభివృద్ధి, గ్రామీణ జీవనోపాధి రంగాల్లో విశేష కృషి చేస్తున్న ఎం.ఎస్. స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్‌కు ఈ అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. బతికున్నన్ని రోజులు రైతుల సంక్షేమం కోసం పరితపించిన డాక్టర్ వైఎస్సార్‌ను గుర్తు చేసుకునేలా కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. రైతులు, నిరుపేదల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు 2003లో మండుటెండలో డాక్టర్ వైఎస్సార్ చేపట్టిన 'ప్రజాప్రస్థానం' పాదయాత్రను ఆయన గుర్తుచేశారు. రైతుల ఆత్మగౌరవాన్ని పెంచేందుకు ఉచిత విద్యుత్ అందించాలని వైఎస్సార్ నిర్ణయించారని, అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు ఉచిత విద్యుత్ అందించే ఫైలుపై తొలి సంతకం చేసిన గొప్ప నాయకుడని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. అప్పట్లో రైతులపై ఉన్న సుమారు రూ.1,300 కోట్ల విద్యుత్ బకాయిలను రద్దు చేయడంతో పాటు రైతులపై నమోదైన కేసులను ఎత్తివేసిన చర్యలతో వైఎస్సార్ రైతుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారని అన్నారు. డాక్టర్ వైఎస్సార్ చివరి కోరికను నెరవేర్చేందుకు అందరూ కలిసికట్టుగా పనిచేయాలని సీఎం పిలుపునిచ్చారు. తెలంగాణలో సాగునీటి విస్తరణకు ఆయన కలలు కన్న ప్రాజెక్టులను పూర్తి చేయడం ద్వారా రైతులకు మరింత ప్రయోజనం కల్పిస్తామని స్పష్టం చేశారు. గ్రామీణ పేదలకు కనీస ఆహార భద్రత కల్పించాలనే ఉద్దేశంతో అప్పటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీ ప్రజా పంపిణీ వ్యవస్థను తీసుకొచ్చారని సీఎం వివరించారు. పేదలకు బియ్యం, గోధుమలు తదితర నిత్యావసరాలను అందించే పీడీఎస్ విధానం కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో ప్రారంభమైందన్నారు. ప్రస్తుతం తెలంగాణలో 3.40 కోట్ల మందికి ఒక్కొక్కరికి 6 కిలోల చొప్పున ఉచితంగా సన్నబియ్యం అందించడం ఆ విధానానికి కొనసాగింపేనని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభలో ప్రధాన ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గే, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, తుమ్మల నాగేశ్వరరావు, వివేక్ వెంకటస్వామి, ఎంపీ జైరాం రమేష్, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్‌గౌడ్, కేవీపీ ఫౌండేషన్ అధ్యక్షుడు కేవీపీ రామచంద్రరావుతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# సంక్షేమం,అభివృద్ధికి సమ ప్రాధాన్యం కాంగ్రెస్ 1000 రోజుల పాలనపై సంబరాలు

**హమహిళలు తప్పనిసరిగా క్యాన్సర్ స్క్రీనింగ్ చేయించుకోవాలి**

**క్యాన్సర్ హెల్త్ క్యాంపును ప్రారంభించిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు**



**ఐనవోలు : (జై భీమ్ న్యూస్)**

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 1,000 రోజులు పూర్తైన సందర్భంగా గురువారం ఐనవోలు మండల కేంద్రంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే,విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు నేతృత్వంలో కాంగ్రెస్ నేతలు విజయోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు,కార్యకర్తలు టపాకాసులు కాల్చి, పండ్లు పంచి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ ప్రజలు నిర్బంధ వాతావరణంలో గడిపారని ఎమ్మెల్యే విమర్శించారు. స్వేచ్ఛ కావాలనే ఆకాంక్షతోనే ప్రజలు కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకొచ్చారని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు స్వేచ్ఛగా పనిచేసే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం 1,000 రోజుల పాలనలో పోలీసుల నిర్బంధాలు లేవని, మీడియాపై ఆంక్షలు విధించలేదని అన్నారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు సచివాలయానికి స్వేచ్ఛగా వెళ్లే అవకాశాన్ని రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కల్పించిందన్నారు. అన్ని రంగాల్లో నియంతృత్వ ధోరణికి ముగింపు పలికి స్వేచ్ఛాయుత వాతావరణాన్ని తీసుకొచ్చామని ఎమ్మెల్యే తెలిపారు.అనంతరం మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ఆవరణలో సింధు హాస్పిటల్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత క్యాన్సర్ నిర్ధారణ వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. క్యాన్సర్ ను తొలిదశలోనే గుర్తించి సకాలంలో చికిత్స అందిస్తే పూర్తిగా నయం చేసే అవకాశం ఉంటుందన్నారు. కుటుంబ బాధ్యతల్లో నిమగ్నమై చాలా మంది మహిళలు తమ ఆరోగ్యపై నిర్లక్ష్యం చేస్తున్నారని వ్యాధి ముదిరిన తర్వాత చికిత్స కష్టతరమై ఖర్చులు కూడా పెరుగుతాయని తెలిపారు. స్క్రీనింగ్ లో అనుమానిత కేసులను గుర్తించి వారికి పరీక్షలు చికిత్స అందేలా వైద్య సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అవసరమైన వారికి ప్రభుత్వ పథకాలు ఉచిత లేదా తక్కువ ఖర్చులతో లభించే వైద్య సేవలపై అవగాహన కల్పించాలని వైద్యులను సూచించారు.ఇలాంటి మరిన్ని క్యాన్సర్ హెల్త్ క్యాంపులు అన్ని మండలాల్లో నిర్వహించాలని సింధు హాస్పిటల్ సిబ్బందిని కోరారు.ఈ కార్యక్రమంలో ఐనవోలు మండల అధ్యక్షులు నకరకంటి మోహన్ గౌడ్,జిల్లా అధికార ప్రతినిధి నిమ్మని శేఖర్ రావు, హనుమకొండ జిల్లా కిసాన్ అధ్యక్షులు పింగిలి వెంకట నరసింహ రెడ్డి,ఉపాధ్యక్షులు పోలపల్లి బుచ్చిరెడ్డి,కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు రాయపురం సాంబయ్య,సమ్మెట మహేందర్ గౌడ్,కార్యదర్శి కట్కూరి స్వామి,మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు పోలేపల్లి శివ శంకర్ రెడ్డి గారు,సీనియర్ నాయకులు సీనియర్ నాయకులు సమ్మెట మహేందర్ గౌడ్, మహ్మద్ రఫీ,మండల యూత్ అధ్యక్షులు కత్తి సుధీర్ గౌడ్,మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ శ్రీ కట్కూరి సునీల్, అన్ని గ్రామాల అధ్యక్షులు, ప్రజా ప్రతినిధులు,సర్పంచులు, ఉపసర్పంచులు,సింధు హాస్పిటల్ క్యాన్సర్ సర్జన్ డాక్టర్ మధు నారాయణ,డాక్టర్ హనిష,మార్కెటింగ్ డైరెక్టర్లు విద్యాప్రకాశ్,విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

# పాత్‌ఫైండర్ హైస్కూల్‌లో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

**ఐనవోలు: (జై భీమ్ న్యూస్)**

పాత్‌ఫైండర్ హైస్కూల్లో శ్రీకృష్ణాష్టమి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. చిన్నారులు శ్రీకృష్ణుడు, రాధాదేవి వేషధారణలో మురిపించగా, పాఠశాల ఆవరణలో పండుగ వాతావరణం నెలకొంది.ఈ సందర్భంగా విద్యార్థులు శ్రీకృష్ణుడి బాల్య లీలలు, భగవద్గీత సందేశాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, భక్తిగీతాలు మరియు నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. చిన్నారుల కృష్ణుడు, రాధ వేషధారణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ డైరెక్టర్ డా. ఎల్.ఎన్. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, శ్రీకృష్ణుడి జీవితం, బోధనలు విద్యార్థులకు సత్యం, ధర్మం, ప్రేమ, కర్తవ్యనిష్ఠ వంటి గొప్ప విలువలను నేర్పుతాయని తెలిపారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను చిన్ననాటి నుంచే విద్యార్థులకు పరిచయం చేయడం ఎంతో అవసరమని పేర్కొన్నారు.పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.డి. సుభానొద్దీన్ మాట్లాడుతూ, పండుగల ద్వారా విద్యార్థుల్లో మన సంస్కృతి, సంప్రదాయాల పట్ల అవగాహనతో పాటు ఐక్యత, క్రమశిక్షణ, సృజనాత్మకత పెంపొందుతాయని అన్నారు.శ్రీకృష్ణాష్టమి సందర్భంగా విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ఉపాధ్యాయులు, సిబ్బంది సహకారంతో వేడుకలు విజయవంతంగా ముగిశాయి.